బల్లాలు తుడిచి.. బతుకు బాటను మార్చి..!


సైదులు గౌడ్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: నిరుపేద గీతకార్మిక కుటుంబం వారిది. జీవనోపాధి కోసం ఆరో తరగతిలోనే చదువు మానేసి, మద్యం దుకాణానికి అనుసంధానంగా ఉండే అనుమతి గదిలో బల్లాలు తుడిచే పనిలో చేరాడు ఆ కుర్రాడు. జీవితం, చదువు గొప్పతనాన్ని తెలుసుకుని దూర విద్యలో చదువు పూర్తి చేసి, నేడు అదే ఆబ్కారీ శాఖలో ఉద్యోగం సాధించాడు. ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్న మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన కుక్కల సైదులుగౌడ్ తన జీవిత విశేషాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

పదోతరగతి 5, డిగ్రీలో 8 సార్లు అనుత్తీర్ణత

తల్లిదండ్రులు భిక్షం- ఎల్లమ్మ గీత కార్మికులుగా, రోజువారీ కూలీలుగా పని చేస్తుండేవారు. దీంతో కుటుంబ పోషణ కోసం ఆరో తరగతిలో చదువు మానేసి గ్రామంలోని మద్యం దుకాణంలో అనుమతి గదిలో రూ.300 నెలవారీ వేతనానికి పనిలో కుదిరాను. ఐదేళ్ల తర్వాత 2005లో దూర విద్య ద్వారా పదో తరగతి, డిగ్రీలో చేరాను. పదో తరగతి 5 సార్లు, డిగ్రీలో 8 సార్లు ఫెయిల్ అయ్యాను. అదే సమయంలో మా కాలనీలో ఇళ్ల పట్టాల పంపిణీకి వచ్చిన తహసీల్దారు.. అర్హులైన వారికి పింఛన్లు వంటి వాటికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ సమయంలో నేనొక్కడినే రాయగలిగిన వాడిని కావడంతో వారి దరఖాస్తులన్నీ నింపి కార్యాలయంలో అందజేశాను.

★ నేను అందించిన దరఖాస్తుదారులకు కొద్ది రోజుల్లో సమస్యలు పరిష్కారమయ్యాయి. అప్పుడే నాకు గ్రూప్-2 ఉద్యోగం సాధించి, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యానికి బీజం ఏర్పడింది. చదువు పూర్తి చేయాలనే ధ్యేయంతో సమీపంలోని మాళోతు తండాలో ఓ గది అద్దెకు తీసుకుని రెండు నెలల్లో డిగ్రీలో మిగిలిన 8 సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించాను. అనంతరం బీఈడీ సైతం పూర్తి చేసి, ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీసెట్ రాసి, ఎంఏ ఎకనామిక్స్‌లో 8వ ర్యాంకుతో సీటు సాధించాను. 68 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించిన తర్వాత, ఉద్యోగ నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు లేకపోవడంతో మరోసారి పీజీ సెట్ రాస్తే 5 పీజీలలో 10లోపు ర్యాంకులు వచ్చాయి. లాసెట్‌లో 8వ ర్యాంకు వచ్చింది.

అమ్మకు క్యాన్సర్‌తో కుంగిపోయాను..

అమ్మ సర్వైకల్ క్యాన్సర్‌తో మృతి చెందడంతో కొంతకాలం కుంగిపోయాను. ఆ సమయంలో ఓ గదిని అద్దెకు తీసుకుని రేషన్ బియ్యంతో కాలం వెళ్లదీస్తూ, ఎంఏ పొలిటికల్ సైన్స్ పూర్తి చేశాను. 2016లో గ్రూప్-2 పరీక్షలో 78 శాతం మార్కులతో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకుతో ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగం సాధించాను. 2019 నుంచి నాగర్‌కర్నూలు, కోదాడలో పని చేసి ప్రస్తుతం హైదరాబాద్ ధూల్‌పేటలో విధులు నిర్వర్తిస్తున్నాను.

★ తిండి కోసం నేను పడిన కష్టాలు ఇతరులు పడకూడదనే లక్ష్యంతో 'మన ఆపద్బాంధవులు ఫౌండేషన్'లో భాగస్వామినై రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. సుమారు నాలుగైదు వేల మందికి బియ్యం, నిత్యావసరాల పంపిణీ, ఇతర సహాయ కార్యక్రమాలు నిర్వహించాం.

చదువు విలువ తెలుసుకోవాలి:

చదువు విలువ నాకు ఆలస్యంగానైనా తెలిసింది. దీంతో చదువుపైనే దృష్టి సారించి, విజయాన్ని చేరుకోవాలనే లక్ష్యంతో కృషి చేశాను. చదువే రాదనుకున్న నేను మొదట పదో తరగతిలో 42 శాతం, డిగ్రీలో 48 శాతం, బీఈడీలో 49శాతం మార్కులు సాధించాను. పీజీలో 68 శాతం, ఉద్యోగ పరీక్షలో 78 శాతం మార్కులు సాధించాను. తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదనడానికి నేనే పెద్ద ఉదాహరణ. సైకిల్ కొనుక్కునేందుకు నెలల తరబడి మద్యం దుకాణంలో పని చేసిన నేను, నేడు కారులో తిరుగుతుంటే ఎంతో గర్వంగా ఉంది. నా జీవిత చరిత్రను వివరిస్తూ యూట్యూబ్‌లో చేసిన వ్యక్తిత్వ వికాస తరగతులు మంచి ఆదరణ పొందాయి.

యూరియా వాడకం తగ్గించండి

పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో యూరియాను అధిక మోతాదులో వరి పైరుకు అందిస్తే చీడపీడలు వ్యాపించే అవకాశం ఉందని, యూరియా బదులు మ్యూరేట్ ఆఫ్ పొటాష్(ఎంవోపీ) చల్లుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. బొత్తలపాలెం, నాగిరెడ్డిగూడెం, పాలకవీడు గ్రామాల్లో వరి క్షేత్రాలను శనివారం పరిశీలించి మాట్లాడారు. వరిలో ఆకుచుట్టు పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉందని, క్లోరిపైరిఫాస్ 20% ఈసీ లీటర్ నీటికి 3 ఎంఎల్ చొప్పున పిచికారీయాలన్నారు. ఆలస్యంగా నాటిన వరిలో కాండం తొలచు పురుగు నివారణకు కార్ట్ ఆఫ్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పలు ఎరువులు, పురుగుమందు దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల అమ్మకాలు ఈ-పాస్ విధానం ద్వారానే జరపాలని, లేకుంటే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఏఈవోలు వెంకటేశ్, గోపి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పొదుపు తెచ్చిన పండగ


మగ్గంపై వస్త్రం నేస్తున్న చేనేత కార్మికుడు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చేనేత కార్మికులు పండగ పూట పస్తులుండకుండా నేతన్నకు చేయూత పథకంలో పొదుపు చేసుకున్న డబ్బును బ్యాంకుల నుంచి విడుదల చేయనున్నారు. ఈ పథకం లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వ వాటా బకాయిలను ఉమ్మడి నల్గొండ జిల్లాకు చేనేత, జౌళిశాఖ ద్వారా నెల క్రితం ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లా సహాయ సంచాలకులు బ్యాంకులకు వెళ్లి పొదుపు ఖాతాల లెక్కలను సరి చూసి చేనేత కార్మికుల రికరింగ్ డిపాజిట్ ఖాతా-2లో ప్రభుత్వ వాటా డబ్బును జమ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో నిధుల విడుదలకు ఉత్తర్వులు విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. 'నేతన్నకు చేయూత' పథకంలో 36 నెలల పాటు బ్యాంకుల్లో పొదుపు చేసుకున్న ఒక్కో చేనేత కుటుంబానికి రూ. 2,80,400, వడ్డీ కూడా అందనున్నాయి. చేతినిండా పని లేక, నేసిన వస్త్రాలు అమ్మకాలు జరుగక ఇబ్బందులు పడుతున్న చేనేత కుటుంబాలకు ఈ డబ్బుతో కొంత వెసులుబాటు లభించనుంది. ఆర్థికంగా వెసులుబాటు కల్పించే ఈ పథకాన్ని కొనసాగిస్తారా అని చేనేత కార్మికులు ఎదురు చూస్తున్నారు. కొత్తగా రికరింగ్ డిపాజిట్ ఖాతాలు తెరిపించాలని ప్రభుత్వ ఉత్తర్వులు రాలేదని అధికారులు సమాధానమిస్తున్నారు. ప్రజా ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించాలని చేనేత కార్మికులు కోరుతున్నారు.

○ చేతికందనున్న డబ్బు

ఆర్థిక భరోసా కల్పించే

చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించాలని, వారిలో పొదుపు అలవాటును ప్రోత్సహించాలని భారాస ప్రభుత్వం నేతన్నకు చేయూత పథకాన్ని మూడేళ్ల కాలపరిమితితో భూదాన్ పోచంపల్లిలో 2017 జూన్ 24న ప్రారంభించింది. 2000 మే నెలలో పూర్తయింది. కరోనా రావడంతో మూడు నెలల ముందుగానే డబ్బు చేతికిచ్చారు. ఏడాది పాటు ఈ పథకాన్ని పునరుద్ధరించలేదు. చేనేత కార్మికులు విన్నవించుకోవడంతో అప్పటి ప్రభుత్వం రెండో విడత 2021 జులైలో ఈ పథకాన్ని ప్రారంభించింది. గడువు పూర్తి కాకముందే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పది నెలల పాటు నిలిచిపోయిన ఖాతా-2 లలో ప్రభుత్వ వాటా డిపాజిట్లను ఒకే సారి జమ చేసింది. 2024 ఆగస్టు నెలతో ఈ పథకం మూడేళ్ల కాలపరిమితి ముగిసింది. దీంతో రికరింగ్ ఖాతా-1, 2లు రద్దు చేసి వడ్డీతో సహా డబ్బును చేనేత కార్మికులకు చేతికివ్వనున్నారు.

నేతన్నకు చేయూత పథకంలో లబ్ధిదారులు

యాదాద్రి	నల్గొండ	సూర్యాపేట
11,099	5,500	200

● జిల్లా ● చేనేత కార్మికులు

ఒక్కొక్కరికి వచ్చేది ఎంతంటే..

కార్మికులు	పొదుపులు (రూ.లలో)	ప్రభుత్వ వాటా (రూ.)	మొత్తం (రూ.)
మగ్గం నేసే కార్మికుడు	43,200	86,400	1,29,600
అనుబంధ కార్మికుడు-1	28,800	57,600	86,400
అనుబంధ కార్మికుడు-2	21,200	43,200	64,400

కొనసాగించాలని కోరాం



– జి. బాలయ్య, 'ఆప్కో' మాజీ డైరెక్టర్, భువనగిరి

పొదుపు పథకాన్ని కొనసాగించాలని ముఖ్యమంత్రిని కోరాం. గత ప్రభుత్వం జియోట్యాగ్ నిబంధన విధించడం వల్ల చేనేత కార్మికులందరూ ఈ పథకాన్ని వినియోగించుకోలేకపోయారు. పొదుపు డబ్బు మగ్గం నేసే కార్మికుడికి రూ. 1200, అనుబంధ కార్మికులకు రూ. 800, రూ. 600 అనే పరిమితి ఉండేది. దీనిని సవరించాలి. చేనేత కార్మికుల పొదుపునకు రెట్టింపు డబ్బును ప్రభుత్వం జమ చేస్తే చేనేత కుటుంబాల ఆర్థిక అవసరాలకు ఉపయోగపడుతుంది.

ఘనం.. బతుకమ్మ సంబరం



కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తమ ఆటపాటలతో అలరించారు. విద్యాసంస్థల ఛైర్మన్ నీలా సత్యనారాయణ శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ గాంధీ, డైరెక్టర్ నాగార్జునరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. – కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

జిల్లా సరిహద్దుల్లో నిరంతర నిఘా


నల్లబండగూడెం చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఐజీపీ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి ఎస్పీ శరత్‌చంద్ర పవార్

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, చెక్‌పోస్టుల వద్ద నిరంతరం నిఘా కొనసాగుతుందని మల్టీ జోన్-2 ఐజీపీ సత్యనారాయణ తెలిపారు. సూర్యాపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిబ్బంది ఎవరైనా అక్రమార్కులతో చేతులు కలిపితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి సరఫరా, వినియోగం, ఇసుక రవాణా, పీడీఎస్ బియ్యం, జూదం, వంటివి సామాజిక రుగ్మతలని వీటిపై ఎప్పటికప్పుడు నిరంతరం నిఘా ఉంటుందని పేర్కొన్నారు. ఆంధ్రా-తెలంగాణ చెక్‌పోస్టులను పరిశీలించి బలోపేతం చేస్తామని చెప్పారు. సరిహద్దుల నుంచి జిల్లాలోకి అక్రమ రవాణా సాగకుండా సిబ్బంది కఠినంగా వ్యవహరించాలన్నారు. మల్టీ-2 పరిధిలో 22 ప్రాంతాలలో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, నారాయణపేట, జోగులాంబ గద్వాల, కర్ణాటక, రాయచూరు శివారు వద్ద చెక్‌పోస్టులు నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం జిల్లాలో కేసుల వివరాలు, సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ శరత్ చంద్ర పవార్, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఇతర రాష్ట్రాల ధాన్యానికి ప్రవేశం లేదు'


కోదాడ గ్రామీణం: వానాకాలం సీజన్‌లో ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా వచ్చే ధాన్యానికి రాష్ట్రంలోకి అనుమతులు లేవని మల్టీ జోన్-2 ఐజీపీ సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని నల్లబండగూడెం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. అక్రమ రవాణాలను అరికట్టేందుకు మల్టీ జోన్-2 పరిధిలోని 22 చెక్‌పోస్టులను బలోపేతం చేసినట్లు తెలిపారు. ఇసుక, గంజాయి రవాణాకు శాశ్వతంగా చెక్ పెడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రధాన చెక్‌పోస్టుగా ఉన్న గుర్తింపు పొందిన నల్లబండగూడెం వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పలు రికార్డులతో పాటు వాహనాలను తనిఖీ చేశారు. ఏఎస్పీ నాగేశ్వరరావు, సీఐ రజితారెడ్డి, ఎస్సై అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులపై పర్యవేక్షణ కొరవడితే చర్యలు


ప్రజా వేదికలో మాట్లాడుతున్న అదనపు డీఆర్డీవో శిరీష

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: ఉపాధి పనులపై పర్యవేక్షణ బాధ్యత ప్రతిరోజు గ్రామ పంచాయతీ కార్యదర్శులదేనని అదనపు డీఆర్డీవో శిరీష అన్నారు. ఉపాధి హామీ పనులపై శనివారం మేళ్లచెరువు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ఆమె మాట్లాడారు. 01.04.2023 నుంచి 31.03.2024 వరకు ఇక్కడ 417 పనులు జరిగాయి. వీటి విలువ రూ.2.13 కోట్లు. రామాంజనేయ తండా, వెల్లటూరు గ్రామాల్లో మొక్కల పెంపకంలో తీవ్ర నిర్లక్ష్యం జరగడంపై డీఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. వేపలమాధారం, మేళ్లచెరువులో జరిగిన పనుల నివేదికల సమర్పణలో నిర్లక్ష్యంపైనా అసహనం వ్యక్తం చేశారు. రేవూరులో జరిగిన పనుల గుర్తింపుపై క్వాలిటీ కంట్రోలు వారు మరోసారి పరిశీలన జరపాల్సి ఉందన్నారు. రిమార్కులకు సంబంధించి రూ.33 వేలు జరిమానా, మరో రూ.39 వేలు రికవరీ చేయాలని సూచించారు. ఎంపీడీవోలు ఆధారాలు లేకుండా ఏ పనినీ ధ్రువీకరించరాదన్నారు. ఉపాధి పనులపై ఇక్కడ పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ తక్కువగా ఉందన్నారు. ప్రతి పని ఫలితం నిత్యం వెళ్లి రిమార్కులు గుర్తించాలన్నారు. నిర్లక్ష్యంతో షోకాజు నోటీసులు వచ్చేదాకా ఉండొద్దని హెచ్చరించారు. గతేడాది కంటే 300 శాతం ఉండేలా పనులను చూడాలని, వచ్చే నెలలో పాత గుర్తింపు జరగాలన్నారు. పశువులు, కోళ్ల షెడ్లు వేసుకునేందుకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను అభినందించారు. విజిలెన్స్ అధికారిణి ఆశ, లింగారెడ్డి, అంబుడ్స్‌మెన్ లచ్చిరాం నాయక్, ఎంపీడీవో అస్గర్ అలీ, ఎంపీవో గోపి, ఏపీవో శైలజ పాల్గొన్నారు.

అన్నపూర్ణ దేవిగా అమ్మవారు



మండల కేంద్రంలోని కనకదుర్గ దేవాలయంలో శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారు మూడో రోజు అన్నపూర్ణదేవిగా ప్రత్యేక అలంకరణలో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు కందాల ప్రశాంతాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని హోమాల్లో పాల్గొన్నారు. – మునగాల, న్యూస్‌టుడే:

యువ న్యాయవాదులు వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలి: జస్టిస్ మాధవిదేవి


సూర్యాపేటలో నూతన భవనాలను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి జస్టిస్ మాధవిదేవి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి

సూర్యాపేట న్యాయవిభాగం, న్యూస్‌టుడే: బాధితులకు న్యాయం జరిగేలా వ్యవస్థలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, సూర్యాపేట జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ టి.మాధవిదేవి కోరారు. సూర్యాపేట కోర్టుల ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనాన్ని శనివారం న్యాయమూర్తి ప్రారంభించారు. మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సౌకర్యాల కల్పన ద్వారా కక్షిదారులకు మెరుగైన సేవలు అందించవచ్చని అభిప్రాయపడ్డారు. అనంతరం న్యాయవాదులనుద్దేశించి ప్రసంగించారు. యువ న్యాయవాదులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకునేలా కృషి చేయాలని సూచించారు. అంకితభావంతో పనిచేసినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించటం సాధ్యమని తెలిపారు. నైపుణ్యాన్ని పెంపొందించుకున్నప్పుడే న్యాయవాదులు వృత్తిలో విజయం సాధిస్తారని, కక్షిదారులకు మెరుగైన సేవలందించటం సాధ్యమని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సింగిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, కె.సురేష్, ఫర్హీన్ కౌసర్, జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నూకల సుదర్శన్‌రెడ్డి, డి.మల్లయ్య, జిల్లాలోని ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు.

★ తొలుత న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవిదేవికి జిల్లా కోర్టుల తరపున ప్రధాన న్యాయమూర్తి ఎస్.గోవర్ధన్‌రెడ్డి, న్యాయవాదుల సంఘం తరపున నూకల సుదర్శన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఘనంగా ఆహ్వానించారు. జిల్లా పోలీసుల తరపున న్యాయమూర్తికి గౌరవ వందనం సమర్పించారు. జిల్లా న్యాయ ఉద్యోగుల సంఘం తరపున న్యాయమూర్తిని సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దాసరి మధు, ఇతర బాధ్యులు బ్రహ్మారెడ్డి, మహేష్, ఆంజనేయులు, ఉమ, పాల్గొన్నారు.

★ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి కోర్టులలోని పలు సమస్యలను న్యాయమూర్తి జస్టిస్ మాధవిదేవి దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కోర్టులలో ఫ్యామిలీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా కోర్టుల ఏర్పాటు ఆవశ్యకతను న్యాయమూర్తికి విశదీకరించారు. అనంతరం బార్ అసోసియేషన్ తరపున న్యాయమూర్తి జస్టిస్ మాధవిదేవిని ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

దొంగల ముఠా అరెస్టు

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు సభ్యుల దొంగల ముఠాను సూర్యాపేట గ్రామీణ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వివరాలను డీఎస్పీ రవి శనివారం సూర్యాపేటలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మునగలవీడు గ్రామానికి చెందిన దాసరి మురళి, దాసరి జంపయ్య, మాదగాని సుమన్, నెల్లకుదురు మండలం రాజులకొత్తపల్లికి చెందిన అంగడి సురేష్ కలిసి ముఠాగా ఏర్పడి రాత్రి తాళంవేసిన ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. సూర్యాపేటలోని జనగామ చౌరస్తాలో వాహనాల తనిఖీలో భాగంగా శుక్రవారం అనుమానాస్పదంగా కనిపించటంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా 13 ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు డీఎస్పీ వివరించారు. నలుగురి నిందితులలో దాసరి మురళీ అలియాస్ మురళీకృష్ణపై నెల్లికుదురు పోలీసులు పీడీయాక్ట్ కేసు పెట్టగా 15 నెలలుగా హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలులో ఉండి వచ్చినట్లు తెలిపారు.


సూర్యాపేటలో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి

★ 2023లో సిద్దిపేట జిల్లా కోదూరు పరిధితోపాటు, బెజ్జంకి మండలం దాచారం, సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం తుమ్మల పెన్‌పహాడ్, బెజ్జంకి పోలీసుస్టేషన్ పరిధిలో, 2024లో సైఫాబాద్, నందిగామ పోలీసుస్టేషన్ల పరిధి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి, పెద్దపల్లి జిల్లా హనుమాన్‌నగర్, సూర్యాపేట జిల్లాకేంద్రంలో పలు టౌన్‌షిప్‌లలో ఇళ్లల్లో ఆ ముఠా దొంగతనాలకు పాల్పడినట్లు డీఎస్పీ వివరించారు. సూర్యాపేట మండలం రాయినిగూడెంలో నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోంచి పుస్తెలతాడును అపహరించుకుపోయినట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి నుంచి పది తులాల బంగారం, 75 తులాల వెండి, నాలుగు చరవాణులు, ఆటో, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీన పర్చుకున్నామని డీఎస్పీ తెలిపారు.


ప్రతి కుటుంబ వివరాల నమోదు తప్పనిసరి: కలెక్టర్


సూర్యాపేట: 37వ వార్డులో డిజిటల్ కార్డు సర్వే చేపడుతున్న సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డిజిటల్ కార్డు సర్వేలో ప్రతి కుటుంబ వివరాలు నమోదు చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. సూర్యాపేటలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన 37వ వార్డులో చేపడుతున్న డిజిటల్ కార్డు సర్వేను శనివారం ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఒకే ఇంట్లో ఇద్దరు కుమారులు ఉండి వివాహమైతే రెండు ప్రత్యేక కుటుంబాలుగా గుర్తించి వివరాలు నమోదు చేయాలన్నారు. సిబ్బంది సర్వేకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోతే వారి చరవాణి ద్వారా సమాచారం ఇచ్చి మరుసటి రోజు వివరాలు తీసుకోవాలని పేర్కొన్నారు. 37వ వార్డులో ఇప్పటి వరకు 501 గృహాలలో సర్వే పూర్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో వేణు మాధవ్, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, పుర కమిషనర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్లు శ్వేత, జానకిరాంరెడ్డి, సీఈవో, ఆర్పీలు పాల్గొన్నారు.

సూర్యాపేట కలెక్టరేట్: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని విధాలా సహకారం అందిస్తున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా పరిశ్రమల స్థాపనకు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి సింగిల్‌విండో ద్వారా అనుమతులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. పీఎం విశ్వకర్మలో భాగంగా 18 రకాల స్వయం ఉపాధిపై ఇచ్చే శిక్షణపై డీపీవో, ఎల్‌డీఎం పరిశ్రమల శాఖ అధికారులు పరిశీలించి పూర్తి నివేదిక అందజేయాలన్నారు. సమావేశంలో ఇండస్ట్రియల్ మేనేజర్ టి.సీతారాం, ఎల్‌డీఎం బాపూజీ, సీపీవో కిషన్, ఫైర్ అధికారి జానయ్య, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఆదిత్య, సీటీవో యాదగిరి పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం


సూర్యాపేట ఆర్టీసీ డిపో ఎదుట అమరవీరుల చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: ఆర్టీసీ కార్మికుల హక్కుల కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన అమరుల త్యాగాలు చిరస్మరణీయమని ఆర్టీసీ ఐకాస కార్మిక సంఘాల నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని సూర్యాపేట ఆర్టీసీ డిపో ఎదుట ఐకాస కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరవీరుల పోరాట స్ఫూర్తితో తమ హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 2019లో 55 రోజుల పాటు కొనసాగిన సమ్మె పోరాట చరిత్రలో నిలిచిపోయిందన్నారు. నాయకులు ఎస్.ఎస్.గౌడ్, బత్తుల సుధాకర్, లచ్చయ్య, దోన్‌వాన్ రవికుమార్, పి.ఎం.రావు, ఘనీ, సేవ్య, వి.లక్ష్మయ్య, శ్రీకంఠ్, భాస్కర్, డేగల రవి, రమేష్, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా అండర్-14 క్రికెట్ పోటీలు

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్‌జీఎం క్రికెట్ మైదానంలో శనివారం ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి అండర్-14 బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా జట్టుపై నల్గొండ జట్టు గెలుపొందింది. నల్గొండపై సూర్యాపేట జిల్లా జట్టు అద్భుత పోరాటాన్ని ప్రదర్శించి విజయం సాధించింది.

సన్మార్గంలో నడిపేందుకు..!


కొయ్యలగూడెంలోని ఆశ్రమం


సత్యనారాయణ రచించిన ఆధ్యాత్మిక గ్రంథాలు

చౌటుప్పల్, న్యూస్‌టుడే:

మానవ జన్మ గొప్పతనాన్ని వివరించి ప్రజల్ని సన్మార్గంలో నడిపేందుకు, సత్కర్మలు నిర్వహించేలా ప్రోత్సహించేందుకు చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో శ్రీ శివరామ దీక్షిత అచలగురు సంప్రదాయక రాజయోగ ఆశ్రమాన్ని 2003లో స్థాపించారు. 21 ఏళ్లుగా ఆశ్రమ అధిపతులు 'సుజ్ఞాన వివేకానంద' వర్కాల సత్యనారాయణ, 'శ్రీగురు కరుణానంద' బోగ మాధవులు ఆధ్వర్యంలో నాటి, నేటి తరాన్ని ఆకట్టుకునేలా కుల, మత భేదం లేకుండా ఈ ఆశ్రమంలో జ్ఞాన బోధ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రతి సమస్యకు పరిష్కారంగా భగవద్గీత ఎలా ఉపయోగపడుతుందో వివరిస్తున్నారు. ఆనందంగా ఉండాలంటే ఆరోగ్యంగా ఉండాలని, దాని కోసం నిత్యం యోగ, ప్రాణాయామ సాధన చేయిస్తున్నారు. పౌర్ణమి రోజున సత్సంగం, గురు పాదుకాపూజ నిర్వహించడంతో పాటు హాజరైనవారందికీ భోజనం పెడుతున్నారు. ఏటా వార్షిక ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

ఆశ్రమంలో బోధనాంశాల సారం...

◆ దేవుడు ఎక్కడో లేడు. దయగల హృదయంలో కొలువై ఉన్నాడు. జీవుల పట్ల దయతో మెలగాలి.

◆ సదాచారం, సత్ప్రవర్తన, గాయత్రి మహా మంత్ర జపం, ఈశ్వరోపాసన, సత్సంగాత్యం, సత్య సహవాసం, సజ్జన సేవతో తేజస్సు, ఆత్మశక్తి కలుగుతాయి.

◆ శీలం, సదాచారంతో జీవించాలి. వాటితో హృదయం శుద్ధి అవుతుంది.

◆ అన్ని జీవులలోకెల్లా మానవ జన్మ ఉత్తమమైంది. సార్థకం చేసుకోవాలంటే, ఆదర్శప్రాయమైన జీవితానికి గురువు అవసరం.

◆ తల్లి తొలి, విద్య నేర్పినవారు రెండో గురువు. జీవిత పరమార్థాన్ని తెలిపి, జ్ఞానజ్యోతిని వెలిగించే సద్గురువును ఆశ్రయించాలి.

◆ జగత్తు అంటే భూమి, ఆకాశం, గాలి, అగ్ని, నీరు. మానవదేహంలోనూ ఈ పంచభూతాలున్నాయి. ఈ పంచభూతాల అధిష్ఠాన దేవతలే ఆత్మ, పరమాత్మ.

◆ ప్రతి స్త్రీ తన జాతిని గౌరవించే విధంగా తమ సంతానాన్ని పెంచాలి.

భగవద్గీత విని ప్రభావితులవుతున్నారు..


– 'సుజ్ఞాన వివేకానంద' వర్కాల సత్యనారాయణ



నా గురువులు తిరువీధుల బాపనయ్య, కొండోజు బ్రహ్మానంద. వారి బోధనలను గ్రామ ప్రజలకు వివరించేందుకు ఆశ్రమాన్ని నెలకొల్పాం. గత నలభై ఏళ్లుగా భగవద్గీత ప్రబోధం చేస్తున్నా. సత్సంగంలో భాగవతం, గరుడ పురాణం సైతం వివరిస్తున్నాం. ప్రజలకు అర్థమయ్యేలా విజ్ఞాన రాజయోగ సారామృతం, గురు బోధామృతం, దైవ ప్రార్థన, భగవద్గీత సారామృతం, నిత్య ప్రకాశిక రచించి పంపిణీ చేస్తున్నాం. 180 మంది శిష్యులుగా చేరారు.

చేసే కర్మలోనే భగవంతుడు

– శ్రీగురు కరుణానంద బోగ మాధవులు



నిష్కామకర్మ చేయాలని, అహంకారం ఉండకూడదని, చేతనైనంత ధర్మం చేయాలని, ఇతరులకు కష్టం కల్గించకూడదని, జ్ఞానం పెంపొందించుకోవాలని, మనం చేసే కర్మలోనే భగవంతుడున్నాడని ఆశ్రమంలో నిత్యం సత్సంగంలో బోధిస్తున్నాం. ఆరోగ్యం కోసం యోగా, ప్రాణాయామం చేయిస్తున్నాం. నాకు వంద మందికి పైగా శిష్యులుగా మారారు. సన్మార్గంలో నడుస్తూ మిగితా వారిని ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నాం. ప్రజలు ధర్మ మార్గంలో నడిస్తేనే మానవ జీవితానికి సార్థకత.

బోధన ప్రణాళిక ఇలా...

సోమ, మంగళవారాలు: ప్రాణాయామం, యోగ సాధన

గురు, శుక్ర, శని, ఆదివారాలు: వివిధ అంశాలపై సత్సంగం

ప్రతి పౌర్ణమి రోజు: గురు పాదుకాపూజ, అన్నప్రసాదం వితరణ

ప్రతి ఏడాది: ఆశ్రమ వార్షికోత్సవం, సత్కారం

పూదోట.. బతుకుబాట


హుజూర్‌నగర్-కోదాడ రహదారి వెంట వేసిన బంతి తోట

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: భూమి లేదు కాని రైతు అయ్యాడు. ఉపాధి వెతుక్కుంటూ ఖాళీ స్థలాల్లో పూల తోటలు వేసి జీవనానికి బాట వేసుకున్నాడు హుజూర్‌నగర్ పురపాలిక పరిధిలోని మగ్దూంనగర్‌కు చెందిన ఎస్కే అహమ్మద్. హుజూర్‌నగర్ శివారులో ఖాళీగా ఉన్న స్థలాలను కౌలుకు తీసుకుని బంతి, గులాబీ పూల తోటలు వేసి జీవనం సాగిస్తున్నాడు. ప్రస్తుతం పండగల సీజన్ కావడంతో మంచి డిమాండ్ ఉంది. అన్ని కాలాల్లోనూ పూలు లభించేలా రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకొని వాటిలో పూల తోటలు వేసి అంతర పంటగా కూరగాయలు సాగు చేస్తున్నారు. గతంలో పూల తోట వేయక ముందు బొప్పాయి తోట, కూరగాయలు వేశారు. కానీ పెద్దగా లాభం కన్పించక పోవడంతో పూల సాగు చేస్తున్నారు. 75 రోజులలో బంతి పూలు పూస్తాయి. వీటికి కూడా చీడపీడలు వస్తుంటాయి. ఇతర పంటలతో పోల్చితే తక్కువే.

❑ మొక్కలను ఏపీలోని వివిధ ప్రాంతాలలోని నర్సరీల్లో కొనుగోలు చేసి తీసుకు వచ్చి నాటుతారు. ఎకరానికి దాదాపు రూ.12 వేల విలువ చేసే మొక్కలు నాటుతున్నట్లు **అహమ్మద్** తెలిపారు. బంతిపూలు ఎకరంలో, ఎకరన్నర భూమిలో గులాబీ మొక్కలు సాగు చేస్తున్నారు. గులాబీ మొక్కలు ఒకసారి నాటితే ఏళ్ల తరబడి పూస్తుంటాయి. ఒకసారి పూల పంట చేతికందిన తరువాత వాటి కొమ్మలు కత్తిరించి మళ్లీ శుభ్రం చేస్తే అవి తిరిగి పూస్తాయి. ఈలోగా వాటిలో అంతర పంటగా బంతి, కనకాంబరాలు తదితర చిన్న చిన్న పూలు వేసుకుంటే ఆదాయం వస్తుందంటారు అహమ్మద్. ఏటా అన్ని ఖర్చులు పోనూ దాదాపు రూ.2.50 లక్షల ఆదాయం ఉంటుందని తెలిపారు. భూమి కౌలుకు తీసుకోవడం వల్ల ఖర్చు ఎక్కువ వస్తుంది కానీ లేకపోతే పూల సాగు బాగా లాభదాయకం అని చెబుతున్నారు.



ట్రస్టు సేవ.. విద్యాభివృద్ధికి తోవ


విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ట్రస్టు కన్వీనర్ లచ్చయ్య (పాతచిత్రం)

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్న గ్రామంలో అరబండి రామచంద్రయ్య, కనకదుర్గమ్మ ట్రస్టు విద్యాభివృద్ధి తోడ్పాటునందిస్తూ ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. తమ గ్రామంలోని పేద విద్యార్థులకు సేవలందించడం లక్ష్యంగా వారి కుటుంబీకులు ట్రస్టు ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దగా ఉన్న వల్లంశెట్ల లచ్చయ్య ఈ ట్రస్టు కన్వీనర్‌గా ఉండి సేవలందిస్తున్నారు. ట్రస్టు ద్వారా సేవాకార్యక్రమాల నిర్వహణకు రూ.12 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేశారు. దానిపై వచ్చే వడ్డీని చదువులో ప్రతిభ చూపే పేద విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతుల కోసం వెచ్చిస్తున్నారు. జాతీయ పండగలైన ఆగస్టు 15, జనవరి 26న ఏటా విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్నారు. దీని కోసం ఏటా రూ.66 వేలు వెచ్చిస్తున్నారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.1.30 లక్షలు వెచ్చించి కళావేదిక నిర్మించారు. ఐదారేళ్ల క్రితమే గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సౌరవిద్యుత్తు కోసం రూ.1.60 లక్షల దాకా వెచ్చించారు. పాఠశాలలో ఏ అవసరం వచ్చినా మేమున్నామంటూ ట్రస్టు ద్వారా సాయం అందిస్తున్నారు.

దసరా తర్వాత డిగ్రీ కళాశాలల బంద్


రిజిస్ట్రార్ అల్వాల రవికి వినతి పత్రం అందజేస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్య సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, తదితరులు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంట్‌ల విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ దసరా సెలవుల అనంతరం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ కళాశాలల బంద్ చేపడుతున్నట్లు తెలంగాణ గుర్తింపు పొందిన డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం పేర్కొంది. ఆ సంఘం ప్రతినిధులు శనివారం మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ అల్వాల రవికి సమస్యలతో కూడిన బంద్‌కు సంబంధించిన వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. అప్పులు తెచ్చి భవనాల అద్దెలు, కరెంట్ బిల్లులు, అధ్యాపకులకు, సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. నిధులు లేనప్పుడు విద్యార్థులకు విద్యాపరంగా ఏ విధంగా న్యాయం చేయగలుగుతామని తెలిపారు. దసరా సెలవుల లోపు ప్రభుత్వం బకాయిలు చెల్లించకుంటే కళాశాలల బంద్ కార్యక్రమం తప్పనిసరిగా కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి, కార్యదర్శి సైదారావు, శ్రీనివాస్‌రెడ్డి, జానయ్య, పాల్గొన్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

బుద్ధవనం సందర్శించిన బౌద్ధ భిక్షువులు

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: సాగర్‌లోని బుద్ధ వనాన్ని అశోక, అంబేడ్కర్ దమ్మ యాత్ర బృంద సభ్యులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా జాతీయ బుద్ధిస్ట్ సొసైటీ కౌన్సిల్ పూజ్య మార్య బౌద్ధ భిక్షు భారతీయ ప్రభు మాట్లాడుతూ ప్రపంచ శాంతి, బంధుత్వాన్ని కోరుతూ నిర్వహిస్తున్న ఈ యాత్ర కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం నుంచి నాగ్‌పుర్‌లోని దీక్ష భూమి చేరుకుని, అక్కడ అశోక విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.


బుద్ధ పాదుకల వద్ద బౌద్ధ భిక్షువులు

బుద్ధ వనంలో ఈ బృందం బుద్ధ పాదుకల వద్ద పుష్పాంజలి ఘటించారు. అనంతరం బుద్ధ చరిత వనం, జాతక పార్కు, అవకాన బుద్ధుని విగ్రహం, స్తూప పార్కు తదితర ప్రాంతాలను తిలకించారు. ఈ యాత్రలో దమ్మ కమిటీ సభ్యులు ధర్మేంద్రన్, రాజేంద్రన్, రాజగోపాల్ తదితరులు ఉన్నారు.

నారసింహుడి జన్మ నక్షత్ర వేడుకలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పంచనారసింహుల పుణ్యక్షేత్రంలో శనివారం ఆధ్యాత్మిక పర్వాలు విశేషంగా కొనసాగాయి. ఆలయ దేవుడు నరసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా గర్భగుడిలో వెలసిన మూలవరులకు అష్టోత్తర శత ఘటాభిషేకం జరిపారు. ఆలయ మహాముఖ మండపంలో కలశ పూజ నిర్వహించారు. నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ పర్వాన్ని కొనసాగించారు. సాయంత్రం అలంకార సేవా పర్వాన్ని మంగళవాయిద్యాల మధ్య జరిపారు. అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ స్వాతి ఆరాధనలు నిర్వహించారు. ఆలయ ఈవో భాస్కర్‌రావు, ధర్మకర్త నరసింహమూర్తి పాల్గొన్నారు.


స్వాతి నక్షత్రం వేడుకల్లో భాగంగా జరిపిన స్వర్ణ కలశపూజ

అంబరాన్నంటిన సంబరం..
అలరించిన రూపకం



కోదాడలోని కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి తొమ్మిది అవతారాలను విద్యార్థినులు అలంకరించుకొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహిషాసుర మర్దిని రూపకం అందరినీ అలరించింది. – న్యూస్‌టుడే, కోదాడ పట్టణం

65 కిలోల బంగారంతో.. స్వర్ణమయం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రీశుల స్వర్ణ విమానానికి 65 కిలోల బంగారం కావాలి. ఇప్పటి వరకు దాతల నుంచి విరాళాల ద్వారా పదకొండు కిలోల బంగారం, రూ.20 కోట్ల నగదు చేకూరాయి. అవసరమైన బంగారం సమకూర్చి ప్రభుత్వ సూచన మేరకు అతి త్వరలోనే స్వర్ణ విమానం రూపకల్పన పనులు చేపడతామని ఆలయ ఈవో భాస్కర్‌రావు శనివారం 'న్యూస్‌టుడే'కు తెలిపారు. దాతల సహకారంతో చేకూరిన నగదు, బంగారం కాకుండా కావాల్సిన బంగారాన్ని తమ దేవస్థానం సమకూర్చేందుకు సిద్ధమని ఈవో వెల్లడించారు. ఆలయ హుండీల ద్వారా 1300 కిలోల వెండి, నగల రూపంలో వచ్చిన బంగారం ప్రభుత్వం దృష్టికి తెచ్చి, వాటిని బంగారు విమాన గోపురం తయారీకి వినియోగిస్తామని పేర్కొన్నారు. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారమే చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకు స్వర్ణ తాపడం పనులు కమిటీ సమక్షంలో అప్పగిస్తామన్నారు.


స్వర్ణమయంగా మారనున్న యాదాద్రి ఆలయ విమానం

విమానం స్వర్ణమయం చేసేందుకు కూలి పనులకు రూ.3.90కోట్లు అవసరం. ఆ మొత్తాన్ని దేవస్థానం చెల్లిస్తుందన్నారు. ఈ పనుల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ దసరాలోపు సమావేశం కానుంది.

* గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన క్షేత్రాభివృద్ధిలో సంపూర్ణంగా కృష్ణశిలతో పంచ నారసింహులు కొలువై ఉన్న దేవాలయాన్ని పునర్నిర్మించారు. అప్పుడే గర్భాలయం పై దివ్య విమానాన్ని బంగారు కవచాలతో రూపొందిస్తామని ప్రకటించారు. పనులు రాగి తొడుగుల వరకే పరిమితమైంది. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుమతితో, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాలతో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం సదరు పనులు నిమిత్తం బంగారాన్ని సమకూర్చి అప్పగించేందుకు కసరత్తు చేస్తోంది.

పెరట్లో గంజాయి పెంచుతున్న వ్యక్తి అరెస్టు

గుర్రంపోడు, న్యూస్‌టుడే: రాష్ట్రమంతా గంజాయి నిర్మూలనకు ప్రభుత్వ యంత్రాంగం పరుగులు తీస్తున్నా.. ఓ వ్యక్తి మాత్రం నిర్భయంగా ఎవరూ పట్టించుకోరులే అని తన ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు నాటి చక్కగా పెంచుతున్నాడు. ఈ విషయం ఆనోటా ఈనోటా పోలీసులకు చేరింది. ఇంకేముంది పోలీసులు చడీచప్పుడు లేకుండా సదరు ఇంటికి వెళ్లి చూడగా 18 కిలోల గంజాయి మొక్కలు సాగు చేస్తూ దొరికిపోయాడు. నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం బుడ్డరెడ్డిగూడెం గ్రామానికి చెందిన సింగం ముత్యాలు తన ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు పెంచుతున్నాడు. విశ్వసనీయ సమాచారంతో కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ తన సిబ్బందితో పాటు వ్యవసాయ అధికారి మాధవరెడ్డితో కలిసి శనివారం మధ్యాహ్నం సింగం ముత్యాలు ఇంటిని పరిశీలించారు. పెరట్లో 125 గంజాయి మొక్కలు (సుమారుగా 17.5 కిలోలు) ఉన్నట్లు కనుగొన్నారు. ఆకులు ఎండిపోతే 2 నుంచి 3 కిలోలు అవుతుందని, దాని విలువ రూ.50 వేలకు పైనే ఉంటుందని తెలుస్తోంది. పంచనామా చేసి మొక్కలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నారాయణరెడ్డి తెలిపారు.


ముత్యాలు ఇంట్లో పెంచుతున్న గంజాయి మొక్కలు

కారు బోల్తాపడి వ్యక్తి దుర్మరణం

మద్దిరాల, న్యూస్‌టుడే: కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల కేంద్రంలో జాతీయ రహదారి-365పై శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లాకేంద్రానికి చెందిన బోర్‌వెల్ యజమాని బత్తిని రవీందర్‌గౌడ్(55) తన కారులో మరో ముగ్గురితో కలిసి నుండి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. రెడ్డిగూడెం శివారులో వర్షం కురవడంతో కారు అద్దాల్లోంచి దారి కనిపించక వాహనం అదుపుతప్పి పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. కారు నడుపుతున్న బత్తిని రవీందర్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ముగ్గురు స్వల్పగాయాలతో బయట పడ్డారు. బోల్తా పడిన కారును క్రేను సహాయంతో పోలీసులు బయటకు తీసి మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు అజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

ఆలేరు, న్యూస్‌టుడే: నాన్నమ్మ నెల మాసికం ముగించుకుని వెళుతున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఘటన శనివారం ఆలేరులో జరిగింది. స్థానిక ఎస్సై రజనీకర్, గ్రామస్థుల కథనం ప్రకారం.. రాజాపేట మండలం సోమారం గ్రామానికి చెందిన తమ్మడి హరిగణేశ్(30) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఉంటున్నాడు. డీజే ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. నాన్నమ్మ నెల మాసికం ఉండటంతో శుక్రవారం స్వగ్రామానికి వచ్చాడు. శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఉప్పల్‌కు తిరుగు పయనమయ్యాడు. ఆలేరు సాయి బాబా గుడి సమీపంలోని ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి చేరే క్రమంలో .హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళుతున్న ఆర్టీసీ గరుడ బస్సు బలంగా ఢీకొట్టింది. హరిగణేశ్ తలకు గాయమైంది. 108 అంబులెన్స్‌లో ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చిన కొద్దిసేపటికే మృతి చెందాడు. తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఆర్టీసీ బస్సు స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై చెప్పారు.

కోదాడ

• కోదాడ • హుజూర్‌నగర్

జిల్లాకు ఎస్సీ, ఎస్టీ కోర్టులు మంజూరు చేయాలి

కోదాడ న్యూస్‌టుడే: జిల్లాకు ఎస్సీ, ఎస్టీ కోర్టులు మంజూరు చేయాలని ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ (ఏఐఎల్‌యూ) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. శనివారం కోదాడ కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టుల్లో సమస్యలు పరిష్కారం అయ్యేందుకు సంఘం తరపున పోరాటం చేస్తామన్నారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రంగారావు, శరత్, వెంకట్‌రెడ్డి, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

డీజేలపై పూర్తి నిషేధం

చిలుకూరు: డీజే, అత్యంత ఎక్కువ శబ్ద కాలుష్యం చేసే సౌండ్ సిస్టమ్స్‌ను పూర్తిగా నిషేధిస్తూ జిల్లా మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేసినట్లు చిలుకూరు ఠాణా అధికారి రాంబాబుగౌడ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెళ్లి, పుట్టినరోజు, ఇతర వేడుకలకు, సమావేశాలు, ర్యాలీలకు డీజే సౌండ్ సిస్టమ్స్‌ను నిషేధించినట్లు పేర్కొన్నారు. డీజేకు ఉపయోగించిన వాహనాలు, డీజే యజమాని, అద్దెకు తీసుకున్న వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి: డీఐఈవో

నడిగూడెం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ఆ దిశగా కష్టపడి చదువుతూ భవిష్యత్‌కు బంగారు బాట వేసుకోవాలని సూర్యాపేట జిల్లా ఇంటర్ విద్యాధికారి బి. భానునాయక్ కోరారు. శనివారం నడిగూడెం కేవీఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన స్వాగతోత్సవ సభలో మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. మంచి ప్రదర్శన నిర్వహించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.


విద్యార్థుల నృత్య ప్రదర్శన

వినతి.. నడిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులను కొనసాగించాలని కోరుతూ జిల్లా ఇంటర్ విద్యాధికారి భానునాయక్‌ను అధ్యాపకులు కోరారు. కళాశాలలో కామర్స్, జంతుశాస్త్రం విభాగంలో పనిచేస్తున్న తమకు ఈ ఏడాది రెన్యువల్ చేయలేదని, అధ్యాపకులు రవివర్మ, కాటమరాజులు విన్నవించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని ఆయన అన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

పాలకవీడు గ్రామీణం, న్యూస్‌టుడే: కృష్ణపట్టెలో చివరి ప్రాంతాలైన మహంకాళిగూడెం, గుండెబోయినగూడెం గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు రమేశ్ కోరారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడుతూ గతంలో బస్సు సౌకర్యం ఉందనే విషయం గుర్తుచేశారు. వాణిజ్య, విద్యా కేంద్రాలైన నేరేడుచర్ల, మిర్యాలగూడ పట్టణాలకు వెళ్లాలంటే 25 నుంచి 40 కి.మీ. ఆటోలు, లారీల్లో ప్రయాణించడం మహిళలు, చిన్నారులు, వృద్ధులకు ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సినిమాలు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: దేవర, సత్యం సుందరం, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్:** దేవర, **రంగా:** శ్వాగ్, **వెంకటేశ్వర:** రామ్‌నగర్ బన్నీ

యువోత్సవం

తెలంగాణ ప్రాంతంలో బతుకమ్మ పండగకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఆటపాటలతో తొమ్మిది రోజులు ఘనంగా నిర్వహించుకుంటారు. ఈ పండగపై యువతకు ఆసక్తి పెరిగింది. రంగురంగుల వస్త్రధారణలతో ఆటలు, నృత్యాలతో పండగలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. కోదాడలోని కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన పలువురు విద్యార్థినులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. వారి సొంత ప్రాంతంలో జరిగే వేడుకలపై, బతుకమ్మ పండగ గురించి వారి మాటల్లోనే..

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:


బతుకమ్మలను పూజిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

బతుకమ్మ పేర్చడం సరదా:

అంజలి, కరీంనగర్



రంగురంగుల పూలతో బతుకమ్మ పేర్చడం అంటే చాలా సరదా. త్రికోణాకారంలో పేర్చి అలంకరిస్తాం. మహిళలందరూ ఒక్క చోట గుంపుగా చేరి బతుకమ్మ ఆడుతుంటే ఆ దృశ్యాలు కనువిందు చేస్తాయి. నాకు తొలిరోజు జరిగే ఎంగిలిపువ్వ బతుకమ్మ అంటే ఇష్టం. పండగకు వచ్చిన తోబుట్టువులతో సరదాగా గడుపుతాం.



చివరి రోజు సందడే:

సరయు, జయశంకర్ భూపాలపల్లి



పండగను మేం ఘనంగా జరుపుకొంటాం. సద్దుల బతుకమ్మ రోజు అందరం చెరువు వద్దకు వెళ్లి ఆటపాటలతో నృత్యాలు చేస్తాం. బతుకమ్మ సంబరాలను కనులపండువగా నిర్వహిస్తాం. తెలంగాణ సంస్కృతిని చాటే పండగే ఇది. అనంతరం చెరువులో నిమజ్జనం చేస్తాం.

ఆరోగ్యంతో పాటు ఆనందం

లోహిత, నిజామాబాద్



బతుకమ్మ వేడుకల్లో భాగంగా దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేస్తాం. దసరాకు ప్రత్యేక పిండి వంటలు చేస్తారు. ప్రతి రోజు ప్రత్యేక నైవేద్యం సమర్పిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో అందరూ కలిసి బతుకమ్మ వేడుకలను జరుపుకొంటాం. ఆరోగ్యాన్ని, ఆనందాన్ని పంచే పండగ బతుకమ్మ.

తెలంగాణ సంస్కృతి ప్రతిబింబిస్తుంది: పావని, తూర్పు గోదావరి



మా కళాశాలలో ప్రతి పండగ విశిష్టతను తెలుపుతూ విద్యార్థులతో వేడుకలు జరుపుకొంటాం. వినాయకచవితి, దసరా, దీపావళి, సంక్రాంతి, హోళీ ఇలా అనేక పండగలు కళాశాలలో నిర్వహిస్తారు. తెలంగాణలో దసరా పండగకు మంచి గుర్తింపు ఉంది. వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది.

అంబరాన్నంటిన సంబరాలు

మిట్స్ ఇంజినీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్, ఎంబీఏ కళాశాలలో విద్యార్థులు బతుకమ్మ సంబరాలను శనివారం నిర్వహించారు. బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి.

–చిలుకూరు, న్యూస్‌టుడే:

నూతన కమిటీ ఎన్నిక

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణ సాల్వేషన్ చర్చిలో మండల పాస్టర్ల నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఆదాం, ఉపాధ్యక్షుడిగా ఇస్సాసు, కార్యదర్శిగా రూబేను, సంయుక్త కార్యదర్శిగా జేమ్స్, కార్యవర్గ సభ్యులుగా జేమ్స్, రంజిత్, గౌరవ సలహాదారులుగా రాజారావు, కోఆర్డినేటరుగా ఫినేహాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు నియోజకవర్గ సంఘం అధ్యక్షుడు పాస్టరు శామ్యూల్ తెలిపారు.


నూతన కమిటీ సభ్యులు

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: రేవూరు గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. గాయం రాజశేఖర్‌రెడ్డి, జంగాల ఊషయ్య, పోటు లక్ష్మీ నర్సయ్య, నార్ల హనుమంతరావు, ధరావత్ కోటేశ్వరరావు, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా వేదాంత వరప్రసాద్‌లు వీరిలో ఉన్నారు. ఆలయ ప్రత్యేకాధికారి లక్ష్మణరావు, ఆలయ ఈవో గుజ్జుల కొండారెడ్డి వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ ఛైర్మన్‌గా రాజశేఖర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న ధర్మకర్తలు

ప్రకృతి వ్యవసాయంతో మిత్ర పురుగులకు రక్షణ

గరిడేపల్లి, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంతో నేల, వాతావరణం, పంటలకు మేలుచేసే మిత్ర పురుగులను రక్షించుకోవచ్చని కేవీకే మృత్తికా విభాగం శాస్త్రవేత్త అరిగేల కిరణ్ సూచించారు. ఐదురోజుల శిక్షణలో భాగంగా నేల సారం, పశువుల ఎరువు ప్రాముఖ్యం, జీవన ఎరువులు, వర్మీ కంపోస్ట్, వర్మీ వాష్ తయారీ, వాడకం, అజోలా పెంపకం, వాడే విధానాలను వివరించారు. మార్కెటింగ్ పద్ధతులు, సేంద్రియ సాగుపై క్షేత్రాలను పరిశీలిస్తూ శిక్షణ ఇచ్చారు.



గడ్డిపల్లి కేవీకేలో అజోల్లా పెంపకం, వాడకాన్ని వివరిస్తున్న కిరణ్

ట్రై సైకిల్ అందజేత

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: వేపలసింగారంలోని ఒకటో వార్డులో పక్షవాతంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న చింతమల్ల నగేష్‌కు మాజీ సర్పంచి అన్నెం శిరీష, కొండారెడ్డి దంపతులు అన్నెం వెంకటరెడ్డి మెమోరియల్స్ ఆధ్వర్యంలో రూ.50 వేల విలువ గల ఛార్జింగ్ ట్రై సైకిల్‌ను శనివారం అందజేశారు. నాయకులు సారెడ్డి భాస్కర్‌రెడ్డి, నందిరెడ్డి సైదిరెడ్డి, రోషయ్య తదితరులు పాల్గొన్నారు.


ట్రై సైకిల్‌ను అందజేస్తున్న మాజీ సర్పంచి శిరీష, కొండారెడ్డి

అభిషేకాలు.. పూజలు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: గరిడేపల్లిలోని శివాలయంలో శ్రీ లక్ష్మీనరసింహా స్వామి పీఠం వద్ద ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం పురస్కరించుకుని స్వామివారికి, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, పూజలు జరిపించారు. లక్ష్మీ నరసింహాస్వామి, భవానీ అమ్మవారి దీక్షా స్వాములు, గ్రామస్థులు పాల్గొన్నారు. పూజారి కృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.


గరిడేపల్లిలోని శివాలయంలో పూజలు చేస్తున్న దీక్షా స్వాములు

ఎక్సైజ్ దాడులు.. పలువురిపై కేసులు

హుజూర్‌నగర్ గ్రామీణం, గరిడేపల్లి: ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి లక్ష్మీనాయక్ ఆధ్వర్యంలో నియోకవర్గంలోని అన్ని మండలాల్లో కోదాడ, హుజూర్‌నగర్ పోలీసులు, డీటీఎఫ్ అధికారులతో కలిసి శుక్ర, శనివారాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. చింతలపాలెం మండలం ఎర్రకుండ తండాకు చెందిన భూక్యా వీరా ఇంట్లో ఉంచిన 150 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 10 లీటర్ల సారా పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. మేళ్లచెరువు మండలంలోని పలు తండాల్లో 250 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వసం చేశారు. గరిడేపల్లి మండలం రేగులగడ్డ తండాకు చెందిన బాణోతు కాంతమ్మ, తేజావత్ వెంకటమ్మ ఇళ్లలో ఉన్న 400 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 8 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నేరేడుచర్ల మండలం బూర్గుల తండాకు చెందిన మాలోతు లక్ష్మీ ఇంట్లో రెండు లీటర్ల సారాను, పాలకవీడు మండలం కొత్తతండాకు చెందిన గుగులోతు బుజ్జి ఇంట్లో 5.5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు దివ్య, వెన్నెల, జగన్‌మోహన్‌రెడ్డి, సివిల్ ఎస్సైలు అంతిరెడ్డి, రవీందర్, నరేష్, లక్ష్మీనరసింహ, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం జారి వ్యక్తి మృతి

అనంతగిరి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం జారి పడటంతో తీవ్ర గాయాలై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కోదాడ పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన బత్తుల కోటేశ్వరరావు, చల్లా బాలాజీ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా సనా ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోకి రాగానే ద్విచక్ర వాహనం జారి కింద పడ్డారు. ఈ ఘటనలో వాహనం వెనక కూర్చున్న బాలాజీ(27)కి తీవ్ర గాయాలు కావడంతో, కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ అక్కడ మరణించాడు. ద్విచక్ర వాహనం నడుపుతున్న కోటేశ్వరరావుకు గాయాలై చికిత్స పొందుతున్నాడు. మృతుడి బావ కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

మఠంపల్లి, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం నుంచి మఠంపల్లికి అక్రమంగా ఇసుకను తీసుకొస్తున్న లారీని పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై రామాంజినేయులు శనివారం తెలిపారు.

మది నిండుగా.. పూల పండగ

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ వేడుకలను నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఘనంగా జరిపారు.

అనంతగిరి: అనురాగ్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు పెద్ద ఎత్తున బతుకమ్మలు తయారు చేశారు.

★ అనంతగిరి మండలంలోని వాయిల సింగారం గ్రామానికి చెందిన బుడిగె గోపిశ్రీ, పోరెడ్డి విజయారెడ్డి అనే మహిళలు బతుకమ్మ పండుగలో భాగంగా శనివారం శివలింగం, దుర్గామాత ఆకారంలో ఉండే బతుకమ్మలను తయారు చేశారు.


వాయిలసింగారంలో..


అనంతగిరిలో..


నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..


అనంతగిరి: అనురాగ్ ఇంజినీరింగ్ కళాశాలలో బతుకమ్మలు

ప్రజా సమస్యలపై పోరాటాలు: సీపీఎం

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధమవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగారపు పాండు అన్నారు. గోపాలపురంలో శనివారం నిర్వహించిన గ్రామ శాఖ మహాసభలో మాట్లాడారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత మత ఘర్షణలు పెరిగాయని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలనూ రాష్ట్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. రేషన్ కార్డులు లేవనే సాకుతో సంక్షేమ పథకాలు నిలుపుదల చేయొద్దని సూచించారు. పేదలు ఎదుర్కొనే ప్రతి సమస్యపైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసించాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ శాఖ కార్యదర్శిగా వెంకటయ్యను ఎన్నుకున్నారు.

నడిగూడెం, న్యూస్‌టుడే: అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల వ్యాఖ్యలు దిగజారుడుతనానికి నిదర్శనమని సీపీఎం జిల్లా కార్యదర్శి మట్టిపల్లి సైదులు అన్నారు. శనివారం సిరికొండలో జరిగి పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గ్రామ శాఖ కార్యదర్శిగా శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.


సిరికొండలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సైదులు

చిలుకూరు: ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేయనున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నరసింహారావు అన్నారు. కొండాపురంలో శనివారం జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 10న మాధవగూడెంలో సీపీఎం 8వ మండల మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

పకడ్బందీగా డిజిటల్ సర్వే

కోదాడ న్యూస్‌టుడే: పట్టణంలో డిజిటల్ సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నామని పుర కమిషనర్ రమాదేవి అన్నారు. శనివారం సర్వేను పరిశీలించి, గృహ యజమానులతో మాట్లాడారు. తప్పిదాలకు తావు లేకుండా వివరాలను సమగ్రంగా ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సిబ్బందిని ఆదేశించారు. శనివారం 133 ఇళ్లల్లో సర్వే చేశామన్నారు.

అనంతగిరి: వసంతపురంలో మూడో రోజు సర్వే చేశామని ఎంపీడీవో సుష్మ తెలిపారు. మూడో రోజు 18 మంది ఇళ్లల్లో సర్వే నిర్వహించి, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేశారని తెలిపారు.


కోదాడ పట్టణంలో డిజిటల్ సర్వేను పరిశీలిస్తున్న పుర కమిషనర్ రమాదేవి

ఆపదలో అండగా చిన్ననాటి మిత్రులు

అనంతగిరి, న్యూస్‌టుడే: పాలవరం గ్రామానికి చెందిన గాదే వీరబాబు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అతడి పదో తరగతి మిత్రులందరూ ఈ విషయం తెలుసుకొని రూ.75 వేల రూపాయలు పిల్లల పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, చెక్‌లను బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు. పిల్లల ఉన్నత చదువులకు సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. దీంతో మిత్రులను గ్రామస్థులు అభినందిస్తున్నారు.


బాధిత కుటుంబానికి డిపాజిట్ పత్రాలు అందజేస్తున్న మిత్రులు

ఆదర్శప్రాయుడు వెంకటస్వామి

చిలుకూరు, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి జయంతిని మండల పరిషత్, తహసీల్ కార్యాలయాల్లో శనివారం నిర్వహించారు.


హుజూర్‌నగర్ ఎంపీడీవో కార్యాలయంలో..

❒ హుజూర్‌నగర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, పురపాలికలో, మునగాల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వెంకటస్వామి జయంతిని నిర్వహించారు.

❒ నేరేడుచర్ల: మాజీ మంత్రి వెంకటస్వామి జయంతిని నేరేడుచర్ల పురపాలికలో నిర్వహించారు.

కనులపండువగా దేవీ నవరాత్రులు

న్యూస్‌టుడే బృందం: దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం కనకదుర్గ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాల్లో విశేష పూజలు జరిపించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుఉల ప్రత్యేక హోమాలు చేశారు.

❒ నేరేడుచర్లలో విజయదుర్గ ఆలయం వద్ద నింబమహాలక్ష్మి, అశ్వద్ధనారాయణస్వామిల కల్యాణం జరిపారు.


గరిడేపల్లి: ఎల్బీనగర్‌లో..

❒ హుజూర్‌నగర్ పట్టణంలోని 13వ వార్డు అంబేడ్కర్ కాలనీలో అన్నదానం ఏర్పాటు చేశారు.


హుజూర్‌నగర్: అన్నపూర్ణా దేవిగా అమ్మవారు


నేరేడుచర్ల: విజయదుర్గ ఆలయంలో..


కోదాడలో..

ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి

హుజూర్‌నగర్: ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ తెలంగాణ సంస్థ వివిధ రంగాల్లో సేవ చేస్తున్న వారికి అందించే డాక్టరేట్ పురస్కారానికి నాగన్న ఎంపికవ్వడంతో ఆశావర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఆయన్ను శనివారం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆశా వర్కర్లను చిన్నచూపు చూసిందన్నారు. మంత్రి ఉత్తమ్ సహకారంతో వారికి అన్ని విధాలా సాయమందిస్తామన్నారు. వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు రామకృష్ణ, శ్రీనివాస్, గురవయ్య, రాము, రామరాజు యాదవ్, జానకి, నిర్మల, సబిత పాల్గొన్నారు.

అవీ ఇవీ

పరిశీలన.. కోదాడ: పట్టణంలో జరిగే ఎల్ఆర్ఎస్ సర్వేను శనివారం పుర కమిషనర్ రమాదేవి పరిశీలించారు. త్వరతగతిన దరఖాస్తులను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

దరఖాస్తులు పరిష్కరించుకోవాలి.. అనంతగిరి: ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారు వెంటనే స్పందించి దరఖాస్తులను పరిష్కరించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్ అన్నారు. శనివారం ఖానాపురంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి దరఖాస్తుదారులతో మాట్లాడారు.

మునగాల గ్రామీణం: గ్రామాల్లో ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసిన వారు రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో రమేశ్ దీన్‌దయాళ్ అన్నారు.

అప్పగింత.. గరిడేపల్లి: రెండు నెలల క్రితం పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పట్టుకుని బాధితునికి అప్పగించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. గడ్డిపల్లికి చెందిన నారాయణ రెండు నెలల క్రితం చరవాణి పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నూతన పరిజ్ఞానంతో గుర్తించినట్లు పేర్కొన్నారు.

పుస్తకావిష్కరణ.. కోదాడ పట్టణం: కోదాడ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ముక్కామల జానకీరామ్ 'ఏడురంగుల వాన' పిల్లల కథల పుస్తకాన్ని రచించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగిన లిటరరీ ఫెస్ట్‌లో ఆయన రచించిన పుస్తకాన్ని ప్రముఖ కవి, రచయిత, నవ తెలంగాణ ఫీచర్ ఎడిటర్ కె.ఆనందాచారి ఆవిష్కరించారు. ఎంఈవో సలీంషరీఫ్ తదితరులు అభినందనలు తెలిపారు.

సమయపాలన పాటించాలి.. మునగాల: అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని సీడీపీవో పారిజాతం అన్నారు. మండల కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. ఎత్తు తగిన బరువులేని చిన్నారులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అవసరమైతే వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

విరాళం.. నడిగూడెం: నడిగూడెంలో శ్రీ కోదండరామస్వామి దేవస్థానానికి అనుబంధంగా నిర్మిస్తున్న సీతారామ కల్యాణ మండపం నిర్మాణానికి కోదాడకు చెందిన గెల్లి చక్రధర్‌రావు శనివారం 50 బస్తాల సిమెంట్ విరాళంగా అందజేసినట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకటరత్నం, కొండా వెంకట సత్యనారాయణ గుప్తలు తెలిపారు.

యాచకుడి మృతి.. కోదాడ గ్రామీణం: నల్లబండగూడెంలో మూగయ్య(60) అనే యాచకుడు శనివారం మృతి చెందినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. మరణోత్తర పరీక్షలకు మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి



ఐజీ సత్యనారాయణ పర్యటన

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: సూర్యాపేట పట్టణ పోలీసు స్టేషన్‌ను మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ శనివారం సందర్శించారు. ఐజీకి పూలకుండి ఇచ్చి సీఐ రాజశేఖర్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎస్పీ శరత్‌చంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

తిరుమలగిరి, న్యూస్‌టుడే:

? తిరుమలగిరి పురపాలిక పరిధి ఐదో వార్డులో ఖాళీ స్థలాల్లోకి మురుగునీరు వదలడం ద్వారా దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. – సోమనారాయణ

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– బుచ్చిబాబు, ఇన్‌ఛార్జ్ పుర కమిషనర్

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM) సూర్యాపేట: 9154395978 తుంగతుర్తి: 80085 74450

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని ఆదర్శనగర్ కాలనీలో మురుగుకాలువలు నిర్మాణానికి నోచుకోలేదు. ఇళ్లలోని మురుగు ఖాళీ స్థలాల్లోకి వారడంతో దుర్వాసనతో వస్తోంది. – మోహన్, ఆదర్శనగర్

✔ నిధుల లభ్యతను బట్టి నిర్మిస్తాం. – శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని బొడ్రాయి బజారులో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. చీకటిపడితే దోమల మోత భరించలేకపోతున్నారు. – రమేష్, బొడ్రాయిబజారు

✔ దోమల మందు పిచికారీ చేయిస్తాం.

– సురేష్, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్, సూర్యాపేట

చేతిపంపుల మరమ్మతుపై శిక్షణ


నూతనకల్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో మంచినీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు స్వతహాగా పరిష్కరించుకోవడానికి అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అజయ్ కోరారు. నూతనకల్ మండలపరిషత్ కార్యాలయంలో నూతనకల్, మద్దిరాల మండలాల్లో మంచినీటి సరఫరా చేసే వాటర్‌మెన్లకు నాలుగురోజులు శిక్షణను శనివారం ప్రారంభించి మాట్లాడారు. చేతిపంపుల మరమ్మతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, ఎంపీవో శశికళ, నూతనకల్, మద్దిరాల మండలాల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ఉదయ్‌కుమార్, అఖిల్ పాల్గొన్నారు.

సర్దుబాటు జీవో సవరించండి

సూర్యాపేట (మహాత్మాగాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఎస్జీటీలు ఉండాలని, ఒక పీఎస్‌హెచ్‌ఎంను నియమించాలని ఎస్జీటీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం కోరారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లో సర్దుబాటు పేరుతో వచ్చిన జీవో నెంబర్ 25 అశాస్త్రీయంగా ఉందని, సవరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడిగా గుండా రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కొండా రామాంజనేయులు, కోశాధికారిగా డీకొండ మహేశ్, ఉపాధ్యక్షులుగా చిత్తరంజన్‌రెడ్డి, వెంకన్న, అరుణ్ కుమార్, కార్యదర్శులుగా రామకృష్ణ, రాంబాబు, సైదులు, యాదగిరి ఎన్నికయ్యారు.

7న వామపక్షాల నిరసన కార్యక్రమం

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: గాజాపై ఇజ్రాయెల్ దాడికి నిరసనగా ఈ నెల 7న సూర్యాపేట జిల్లా కేంద్రంలో వామపక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో శనివారం నిర్వహించిన వామపక్ష, ప్రజా సంఘాల జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, పోలెబోయిన కిరణ్‌కుమార్, షేక్ నజీర్, అనంతుల మల్లేశ్వరి, ధూళిపాల ధనుంజయ నాయుడు, బూర వెంకటేశ్వర్లు, దంతాల రాంబాబు, పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మికి అవినీతి మకిలీ

☛ 15 మంది అనర్హులకు చెక్కుల పంపిణీ

☛ ప్రాథమికంగా విచారించిన తహసీల్దారు

నిరుపేద ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి పథకానికి అవినీతి మకిలీ అంటుకుంది. నూతనకల్ మండలం మాచనపల్లి గ్రామంలో కొందరు దళారులు సుమారు 15 మంది అనర్హులకు పథకం లబ్ధి చేకూర్చి 80:20 శాతం చొప్పున ఆర్థికసాయాన్ని పంచుకున్నారని సమాచారం. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో తహసీల్దారు గురువారం క్షేత్రస్థాయిలో విచారణ జరపడం విశేషం.

– నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే:

వాటాల తేడాతో వెలుగులోకి..

ఇటీవల మంజూరైన కల్యాణలక్ష్మి పథకం చెక్కులను లబ్ధిదారుల ఖాతాలో జమ చేయించి వారికి తెలియకుండానే దళారులు విత్‌డ్రా చేశారు. మొత్తం రూ.లక్ష మంజూరైతే అందులో దళారులు రూ.80 వేలు తీసుకొని, మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారులకు అందించారు. ఈ వాటాల విషయంలో తేడాలు రావడంతో దళారులను ఒక వ్యక్తి నిలదీయగా అవినీతి తతంగం వెలుగులోకి వచ్చింది. దీంతో గుట్టుచప్పుడు కాకుండా అతనికి మరికొంత నగదు ముట్టచెప్పి నోరు మూయించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై కొందరు మౌఖికంగా ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన తహసీల్దారు రహస్యంగా విచారణ జరిపారు. విచారణలో గోప్యత పాటించడంపై తమకు అనుమానాలు ఉన్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

అవినీతి జరిగిందిలా..

మాచనపల్లి గ్రామానికి చెందిన దళారులు ఒక ముఠాగా ఏర్పడి పంచాయతీ కార్యాలయంలోని ఓ చిరుద్యోగి సహకారంతో పదిహేనేళ్ల క్రితం వివాహమైన వారి పేరిట నకిలీ ధ్రువపత్రాలు, వివాహ పత్రాలు సృష్టించి కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేస్తున్నారు. వివాహ తేదీలు, శుభలేఖలో కల్యాణ వేదికలు మార్చి దరఖాస్తు సమర్పించారు. జనన ధ్రువీకరణ పత్రాల కోసం పదో తరగతి మార్కుల జాబితానూ మార్చేశారు. కనీస విద్యార్హతలు లేని వారికి పుట్టినతేదీ ధ్రువపత్రాలు నకిలీవి తయారు చేసి జత చేశారు. ఆధార్ కార్డులో ప్రభుత్వం నిర్ణయించిన వయస్సు లేకున్నా అర్హత ఉన్నట్లుగా నకిలీవి తయారు చేశారు. గ్రామ స్థాయిలో పంచాయతీ, రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో వీటిని విచారణ చేయకుండానే దరఖాస్తులను ప్రభుత్వానికి పంపించడం అవినీతికి వత్తాసు పలికినట్లయ్యింది.

విచారణ పూర్తికాలేదు

– శ్రీనివాస్‌రావు, తహసీల్దారు, నూతనకల్

మాచనపల్లి గ్రామానికి చెందిన కొందరు నకిలీ ధ్రువపత్రాలతో కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందారని తెలియడంతో గురువారం ఆ గ్రామంలో ప్రాథమిక విచారణ చేపట్టాం. గతంలో ఉన్న పంచాయతీ కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో విచారణ పూర్తికాలేదు. అవినీతి జరిగినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చాం. ఎనిమిది నుంచి 15 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరు కావడంపై అనుమానాలున్నాయి. వారికి సంబంధించి వివిధ కోణాల్లో విచారిస్తున్నాం. ఎంతమందికి నకిలీ ధ్రువపత్రాలతో కల్యాణలక్ష్మి మంజూరైంది.., ఇందుకు సహకరించిన వారెవరో రెండు, మూడు రోజుల్లో చెబుతాం. బాధ్యులకు చట్టప్రకారం శిక్షపడేలా చర్యలు తీసుకుంటాం.

విద్యుత్తు ప్రమాదం.. ఆస్తినష్టం

చివ్వెంల, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఇంట్లోని సామగ్రి కాలిపోయిన ఘటన మండలంలోని మున్యానాయక్ తండాలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ధరావత్ సురేష్ ఇంటికి విద్యుత్తు సరఫరా చేసే తీగలు ఒకదానికొకటి అంటుకొని షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. సామగ్రి, ఫ్రిజ్, టీవీ, బీరువా ఇతరత్రా కాలిపోవడంతో రూ. లక్షన్నర వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

కేసు నమోదు

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: పాతకక్షల నేపథ్యంలో మండలంలోని ఏనుబాములలో వ్యక్తిపై దాడిచేసి గాయపరిచిన నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై శంకర్‌నాయక్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన కలకోట్ల మురళి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొలం వద్ద అధికంగా నీళ్లు నిలిచి ఉండడంతో పొక్లెయిన్‌తో గండి పెట్టారు. శనివారం పొలం వద్దకు వెళ్లిన మురళిని గండి ఎందుకు పెట్టావంటూ అదే గ్రామానికి చెందిన కలకోట్ల శ్రీను, సతీష్ గొడవపడి రాయితో దాడి చేశారు. మురళి తలకు తీవ్రగాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినటు ఏఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్టుపై ఆందోళన



నూతనకల్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న జాజిరెడ్డిగూడెం మండల కాంగ్రెస్ నాయకులు

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జాజిరెడ్డిగూడెంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుల సమావేశం నిర్వహించకుండా పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ధరూరి యోగానంద చార్యులు అన్నారు. అర్వపల్లిలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్ గౌడ్, తదితరులు సమావేశానికి హాజరు కాకుండా ముందస్తుగా అరెస్టు చేసి నూతనకల్ పోలీస్ స్టేషన్‌కు తరలించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణ కోసమే సమావేశం నిర్వహించాలనుకున్నామని చెప్పారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, వేల్పుల రమేష్, శిగ నసీర్ గౌడ్, అంజయ్యగౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

నూతనకల్ గ్రామీణం: జాజిరెడ్డిగూడెంలో అరెస్టు చేసిన కాంగ్రెస్ నాయకులను నూతనకల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో జాజిరెడ్డిగూడెం కాంగ్రెస్ నాయకులు భారీగా ఇక్కడికి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

హైకోర్టు న్యాయమూర్తి ప్రత్యేక పూజలు



లక్ష్మీనారసింహ స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ మాధవిదేవి, జిల్లా జడ్జి గోవర్ధన్‌రెడ్డి, తదితరులు

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: తిమ్మాపురంలోని శ్రీ సూర్య క్షేత్రం, అర్వపల్లిలోని శ్రీ యోగానంద లక్ష్మీ నారసింహ స్వామి దేవాలయంలో శనివారం **హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవిదేవి,** సూర్యాపేట జిల్లా జడ్జి గోవర్ధన్‌రెడ్డి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్ర విశిష్టతను అర్చకులు వివరించారు. కార్యక్రమంలో తుంగతుర్తి కోర్టు జడ్జి ఫర్హీన కౌసర్, తుంగతుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లపల్లి సత్యనారాయణ, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, ఏఎస్సై రామకోటి, జలెందర్, న్యాయవాదులు వెంకటేశ్వర్లు, పులిచర్ల శ్రీనివాస్, రాజారాం, సతీష్, ప్రతాప్ పాల్గొన్నారు.

భానుపురి: సూర్యాపేట మండలం పిల్లలమర్రిలోని శివాలయాలను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవిదేవి శనివారం సందర్శించారు. ఎర్రకేశ్వరాలయంలో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి విగ్రహం వద్ద పూజలు చేశారు. జిల్లా జడ్జి సింగిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ సివిల్ జడ్జిలు పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, తదితరులు ఉన్నారు.

వృద్ధురాలిని ఢీకొన్న అదనపు కలెక్టర్ వాహనం

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ వాహనం ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడిన ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం. . మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన గంగారపు సరోజన జనగామలోని బంధువుల ఇంటికి వెళ్లి స్టేషన్‌ఘన్‌పూర్ వచ్చారు. రోడ్డు దాటుతుండగా హనుమకొండ వైపు వెళ్తున్న సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్.లత వాహనం సరోజనను ఢీకొట్టింది. సరోజన తలకు, చేతికి బలమైన గాయాలయ్యాయి. వెంటనే అదనపు కలెక్టర్‌తో పాటు స్థానికులు 108లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అదనపు కలెక్టర్ సైతం బాధితురాలితో ఆసుపత్రి వరకు వెళ్లినట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

మద్దిరాల, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన ఘటన మండలంలోని ముకుందాపురంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన బాధితుడు కొరిపెల్లి సందీప్‌రెడ్డి ఇటీవల రూ.75వేలతో పాడిగేదెను కొనుగోలు చేశారు. రోజు మాదిరిగానే గడ్డి మేసేందుకు గేదెను తాడుతో వ్యవసాయక్షేత్రంలో కట్టేశారు. సమీపంలో ఉన్న విద్యుత్తు స్తంభం తీగ తెగిపడి ఉండడంతో గడ్డి మేస్తూ అక్కడికి వెళ్లిన గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందిందని బాధితుడు తెలిపారు.

జిల్లా వైద్యాధికారి ఆకస్మిక తనిఖీ

సూర్యాపేట (తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు సకాలంలో మందులు అందజేయాలని డీఎంహెచ్‌వో కోటాచలం వైద్యులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల పుస్తకాన్ని పరిశీలించారు.

రక్షణ మోకులతో గీతకార్మికులకు శిక్షణ

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: తాటిచెట్లు ఎక్కేందుకు ప్రభుత్వం అందిస్తున్న మోకులే గీతకార్మికులకు రక్షణగా నిలుస్తాయని ఎక్సైజ్‌శాఖ అధికారి గఫూర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు నరేష్, అంజయ్య అన్నారు. ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో శనివారం కల్లు గీతకార్మికులకు ప్రభుత్వం అందించిన కాటమయ్య రక్షణ మోకులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బగాని భిక్షం, ఉయ్యాల నగేష్, కసగాని బ్రహ్మంగౌడ్, మూల ఎల్లయ్య పాల్గొన్నారు.

చివ్వెంల: కల్లుగీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య రక్షణ కవచాలు సంజీవిని వంటివని శిక్షకుడు జెర్రిపోతుల కృష్ణయ్యగౌడు అన్నారు. అక్కలదేవిగూడెంలో అబ్కారీ, బీసీ సంక్షేమ సంఘం అధికారుల ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన శిక్షణలో మాట్లాడారు. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు, ఉయ్యాల నగేష్, పుట్ట చంద్రయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తగిన కృషి చేస్తోందని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి మొగదాల లక్ష్మణ్ గౌడ్ అన్నారు. అబ్కారీ, బీసీ సంక్షేమ శాఖ అధికారుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వివిధ గ్రామాల గీతకార్మికులకు శనివారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అబ్కారీ పోలీసులు అనిల్ కుమార్, నర్మద, బీసీ సంక్షేమ అధికారులు రాంబాబు, భుజంగరావు, కల్లు గీత కార్మిక సంఘం నాయకులు బెల్లంకొండ శ్రీరాములు, మడ్డి అంజిబాబు, బోడ సైదులు, పొడిశెట్టి సైదులు పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి గడ్డం వెంకటస్వామి



సూర్యాపేట ఎస్పీ కార్యాలయంలో వెంకటస్వామి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అదనపు ఎస్పీలు



సూర్యాపేట: పుర కార్యాలయంలో గడ్డం వెంకటస్వామి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని పుర కార్యాలయంలో కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతిని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ తేజస్ నందలాల్‌పవర్ హాజరై వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పుర ఛైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, ఆర్డీవో వేణుమాధవరావు, కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: పేదల తరపున కడ వరకు నిల్చొని పోరాడిన మహనీయుడు గడ్డం వెంకటస్వామి అని అదనపు కలెక్టర్ బీఎస్.లత అన్నారు. వెంకటస్వామి జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా, పేదల పెన్నిధిగా ప్రజల మనస్సులో స్థానం పొందారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో నర్సింహారావు, డీవైఎస్‌వో రాంచందర్‌రావు, సూపరింటెండెంట్ పద్మారావు, డీటీడీవో శంకర్ పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం: మాజీ ఎంపీ జి.వెంకటస్వామి జయంతి సందర్భంగా శనివారం అర్వపల్లిలోని తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళిలు అర్పించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో పవన్ కుమార్, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, జలెందర్ రెడ్డి పాల్గొన్నారు.

నాగారం: నాగారంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం వెంకటస్వామి జయంతి నిర్వహించారు. ఎంపీడీవో ధార శ్రీనివాస్, ఏపీవో రవి, సూపరిండెంట్ ముత్తయ్య పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: గడ్డం వెంకటస్వామి జయంతిని మండలకేంద్రంలోని రెవెన్యూ, మండల ప్రజాపరిషత్ తదితర కార్యాలయాల్లో శనివారం నిర్వహించారు. తహసీల్దారు లాలు, ఆర్ఐలు రంజిత్‌రెడ్డి, అజిజున్నిసా, ఎంపీవో సంజీవయ్య పాల్గొన్నారు.

సూర్యాపేట నేరవిభాగం: మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతిని జిల్లా ఎస్పీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వెంకటస్వామి చిత్రపటానికి అదనపు ఎస్పీలు నాగేశ్వరర్‌రావు, జనార్దన్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. డీఎస్పీ మట్టయ్య, వీరరాఘవులు, చరమంద రాజు, నారాయణ రాజు, నరసింహ, పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



సూర్యాపేట: 28వ వార్డులో అమ్మవారిని దర్శించుకున్న తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి



సూర్యాపేట పట్టణంలోని శ్రీరాంనగర్‌లో..

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సూర్యాపేట పట్టణంలో అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవిగా కొలువుదీరారు. కనకదుర్గ అమ్మవారు, సంతోషిమాత, కనక్యాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ నెలకొంది. అమ్మవారి పేరిట అర్చన, అష్టోత్తర శతనామార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నూతనకల్: మండలకేంద్రంలోని శ్రీమాతా ఫ్రెండ్స్ యూత్ అధ్వర్యంలో దాత పగిళ్ల మల్లారెడ్డి, ప్రమీల దంపతులు, వెంకేపల్లిలో సాదు రామకృష్ణారెడ్డి ఉమ, తీగల శంకర్‌రెడ్డి, స్వప్న, నేతి మధు ఛాయాదేవిల సహకారంతో అన్నదానం చేశారు.

తిరుమలగిరి: తిరుమలగిరిలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు.

తుంగతుర్తి: తుంగతుర్తిలో దుర్గామాత భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. రామన్నగూడెంలో అన్నదానం చేశారు.

తుంగతుర్తి గ్రామీణం: వెలుగుపల్లిలో యువతరం యూత్ ఆధ్వర్యంలో దూదిగాని సైదులు ఆర్థిక సహకారంతో శనివారం అన్నదానం చేశారు.

మద్దిరాల: మండలకేంద్రంలో వేదపండితులు ఆమంచి అనంతరామశాస్త్రీ ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అర్ధనారీశ్వరి అవతారంలో అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. మామిండ్లమడవలో అక్షర యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధానంలో భక్తులకు అన్నదానం చేశారు.

శ్రీనివాసుడికి తిరుమంజన స్నపనం

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం తెల్లవారుజామున స్వామివారికి పంచామృతాలతో తిరుమంజన స్నపనం నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి వేయి నామాలు పఠించి అర్చన, ఇతర పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి కల్యాణం

చివ్వెంల, న్యూస్‌టుడే: మండలంలోని ఉండ్రుగొండ గిరిదుర్గంలో కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామివారికి శనివారం అత్యంత వైభవంగా జరిగింది. అర్చకుడు అరవిందాచార్యులు, ఆలయ పూజారి కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామికి భక్తిశ్రద్ధలతో కల్యాణం నిర్వహించారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు శనివారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో..)

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	3022	1539
జైశ్రీరాం	3282	1686
ఐఆర్-64	2136	1873
హెచ్ఎంటీ	2602	1749
ఆర్ఎన్ఆర్	2169	2169
కందులు	8694	3088
పెసర	6395	3069
వేరుసెనగ	6561	4852
బొబ్బర్లు	3088	2088
వేరుసెనగ	7209	3896
మినుములు	3668	3668

కాంగ్రెస్‌తోనే మూసీ ప్రక్షాళన సాధ్యం: ఎంపీ చామల

నాగోలు, న్యూస్‌టుడే: మూసీ ప్రక్షాళన కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నాగోలులో శనివారం మూసీ పరివాహక ప్రాంత రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. మూసీ ప్రక్షాళన ఎన్నో ఏళ్ల కల అని, కలుషిత నీటితో మూసీ పరివాహక ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతి ప్రభుత్వమూ నదీ ప్రక్షాళనకు ప్రణాళికలు రూపొందిస్తున్నా, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే ఆ కలను సాకారం చేసేందుకు నిబద్ధతతో కృషి చేస్తోందన్నారు. ఎంపీలు మల్లు రవి, సురేశ్ షెట్కార్, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్, బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మధుయాస్కీగౌడ్, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రోడ్డు అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మహిళా సంక్షేమ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బండ్రు శోభారాణి పాల్గొన్నారు.



త్రుటిలో తప్పిన ప్రమాదం

నూతనకల్ మండలం ఎర్రపహాడ్ ముకుందాపురం రహదారిపై శనివారం సాయంత్రం ఈదురు గాలులకు విద్యుత్తు స్తంభం నేల కూలింది. ఆ సమయంలో ముకుందాపురం గ్రామానికి వెళ్తున్న వాహనదారులు, ఎర్రపహాడ్‌కు చెందిన రైతులు వ్యవసాయ పనులు ముగించుకుని వస్తున్నారు. ఎవరికీ ప్రాణాపాయం కలుగలేదు. స్థానికులు విద్యుత్తు అధికారులకు సమాచారం అందించడంతో వెంటనే సరఫరా నిలిపివేశారు. ‘విరిగిన స్తంభం స్థానంలో మరొకటి అమర్చే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి విద్యుత్తు సరఫరా అందిస్తామ’ని డిస్కం ఏఈ ప్రణయ్‌కుమార్ తెలిపారు.

– నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే:

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎం.వి.ఎన్. భవన్‌లో శనివారం నిర్వహించిన ఐద్వా జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో భాజపా అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. మద్దెల జ్యోతి, సురబి లక్ష్మి, మేకనబోయిన సైదమ్మ, తంగేళ్ల వెంకట చంద్ర, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌కు పరామర్శ

సూర్యాపేట(మహాత్మాగాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: నీటిపారుదల, పౌర సరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి ఇటీవల మరణించగా శనివారం తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మంత్రిని పరామర్శించారు. పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

